సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 17 । జూన్ । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదుదారులు పోటెత్తారు. 135 ఫిర్యాదులు నమోదయ్యాయి.

- 8లో ▸



నడిచేదెలా?

గ్రామీణ ప్రాంతాలలోని మట్టి రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షం కురిస్తే నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /23.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్: గవర్నర్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి ఉత్తమ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను సోమవారం జిల్లా అధికారులు, టీఎన్జీవోస్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల జిల్లా అధికారులు సురేందర్, దయానంద్, తిరుమల ప్రసాద్, చంద్రశేఖర్, సతీశ్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, నాగరాజు, ప్రతినిధులు చక్రధర్, దేవరాజు, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, రాజేశ్వర్, సంతోష్‌కుమార్, అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల


కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇంటర్ సెకండియర్‌లో 3,453 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1,957 మంది ఉత్తీర్ణులయ్యారు. 56.68 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఫస్టియర్‌లో 4,363 మంది పరీక్షలు రాయగా 2,441 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత శాతం 55.95 గా నమోదయ్యింది. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

డీఎఫ్‌ఏ కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్(డీఎఫ్‌ఏ) కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తులసికృష్ణ, ఉపాధ్యక్షుడిగా జునైద్, జనరల్ సెక్రెటరీగా వేణుకుమార్ ఎన్నికయ్యారు. అనంతరం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జావెద్ నుంచి ఎన్నిక పత్రం అందుకున్నారు.

స్థానిక పోరుకు సై!



స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్న మంత్రుల ప్రకటనతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. వచ్చేనెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉండడంతో ఆశావహులు ఓట్ల వేటలో పడ్డారు. బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నవారు.. తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో అంతటా రాజకీయం వేడెక్కుతోంది.

- రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ
- పోటీకి ఆశావహుల ఏర్పాట్లు
- వేడెక్కనున్న రాజకీయం

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం గతేడాది ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. అప్పటినుంచి పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గతేడాది జూలైలో మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం, ఈ ఏడాది జనవరిలో బల్దియాల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. అవి కూడా ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీల్లో నిధులు లేక వీధిదీపాలు, తాగునీరు, ట్రాక్టర్ల నిర్వహణ వంటి వాటి కోసం పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి ఆసక్తి చూపినవారు.. ఎన్నికల నిర్వహణను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ రావడంతో నిరాశ చెందారు. తాజాగా మంత్రుల ప్రకటనతో వారిలో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఎలాగైనా పోటీ చేసి గెలుపొందాలన్న ఆరాటంతో ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు.

మూడు పార్టీలకూ ప్రతిష్టాత్మకం

జిల్లాలో మూడు పార్టీలు బలంగా ఉన్నాయి. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కామారెడ్డిలో బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగతా మూడు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నారు. ఎమ్మెల్యేలు లేకపోయినా బీఆర్ఎస్ సైతం బలంగానే ఉంది. ఆయా పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిష్టాత్మకం కానున్నాయి. అధికార పార్టీ తమ వారిని గెలిపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. ఇదే సమయంలో తమ సత్తా చాటడానికి బీఆర్ఎస్, బీజేపీ సైతం గట్టి ప్రయత్నాలు చేయనున్నాయి.

యంత్రాంగం ఎప్పుడో సిద్ధం...

ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసుకుంది. దీంతో ఎప్పుడు షెడ్యూల్ వచ్చినా వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉంది. అయితే షెడ్యూల్‌కు ముందు రిజర్వేషన్ల అంశం తేలాల్సి ఉంది. ఎవరికి ఎంత శాతం రిజర్వేషన్లు అన్నది తేలితే అందుకు అనుగుణంగా అధికారులు రిజర్వేషన్లు ఖరారు చేస్తారు.

యువతలో ఆసక్తి...

పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయడానికి యువత ఎక్కువగా ఆసక్తి చూపుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల గ్రామ స్థాయి నేతలు ముఖ్యంగా యువకులు ఎన్నికల బరిలో దిగేందుకు రెడీ అయ్యారు. కొందరు ఇప్పటికే డబ్బులు కూడా సిద్ధం చేసుకున్నారు. మరికొందరు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రిజర్వేషన్ల అంశం తేలితే రాజకీయ వేడి పెరుగుతుంది. పెద్ద పంచాయతీలు, వెంచర్లు ఎక్కువగా ఉండే గ్రామాల్లో ఎక్కువ మంది బరిలో దిగే అవకాశాలున్నాయి.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



యోగా డే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, అధికారులు

కామారెడ్డి క్రైం: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది ఉత్సవాలలో అందరూ పాల్గొనాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో యోగా డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21 న ఉదయం 7 గంటలనుంచి జిల్లా కేంద్రంలోని సరస్వతి విద్యామందిర్‌లో యోగా దినోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, ఆర్డీవో వీణ, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆయుష్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ప్రకృతి వైద్యాధికారి దేవయ్య, ఆయుష్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి పద్మజ, యోగా శిక్షకులు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మొక్కను నాటి..

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి సోమవారంతో ఏడాది పూర్తయిన సందర్భంగా ఆశిష్ సంగ్వాన్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.



కొట్టుకుపోయిన సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్

సింగితంలో నీరు నిలిచేదెట్లా?

- గతేడాది భారీ ఇన్‌ఫ్లోతో కొట్టుకుపోయిన రిటెయినింగ్ వాల్
- శాశ్వత మరమ్మతులపై దృష్టి సారించని అధికారులు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు

నిజాంసాగర్ : గతేడాది కురిసిన భారీ వర్షాలతో సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్(అడ్డుగోడ) కొట్టుకుపోయి నీరు ఖాళీ అయ్యింది. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసినా.. ఇప్పటికీ శాశ్వత ప్రాతిపదికన అడ్డుగోడ పనులు చేపట్టలేదు. దీంతో వరదలొస్తే నీరు నిలిచేదెలా, పంటలను నీరందేదెలా అని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ ద్వారా మహమ్మద్‌నగర్, గున్కుల్, నర్వ గ్రామాల పరిధిలోని 458 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నిండితే ఆయకట్టుకు రెండు పంటలకు భరోసా లభిస్తుంది. అయితే రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోవడంతో సాగు నీరు ఖాళీగా అయ్యింది. అంతేకాకుండా అలుగు ముందు బుంగల కారణంగా నీరు నిలవడం లేదు. గతేడాది సెప్టెంబర్‌లో రిటెయినింగ్ వాల్ దెబ్బతినగా ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసి చేతులు దులుపుకున్నారు. రిటెయినింగ్ వాల్ నిర్మాణంతో పాటు బుంగల పూడ్చివేత పనులపై దృష్టి సారించడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ మరమ్మతు పనులు ప్రతిపాదనలకే పరిమితం అయ్యాయి. రిటెయినింగ్ వాల్ నిర్మాణంతో పాటు బుంగల మరమ్మతుల కోసం నీటిపారుదలశాఖ అధికారులు రూ. 1.7 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి ఆరు నెలలు కావస్తున్నా నిధులు మంజూరు కాలేదు. అంతేకాకుండా తాత్కాలిక మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు మంజూరు చేయలేదు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



తాత్కాలికంగా ఇసుక బస్తాలతో వేసిన అడ్డుకట్ట

అడ్డుగోడ నిర్మించాలి



సింగితం రిజర్వాయర్ అడ్డుగోడ కొట్టుపోయినా పనులు చేపట్టడం లేదు. శాశ్వత పనులు చేపడితేనే రిజర్వాయర్‌లో నీళ్లు నిల్వ ఉంటాయి. వెంటనే మరమ్మతులు చేపట్టి ఆయకట్టు ప్రాంత రైతులను ఆదుకోవాలి.
– మల్లేశ్ యాదవ్, రైతు, నర్వ

మరమ్మతులు చేయించాలి



సింగితం రిజర్వాయర్ నీటిపై ఆధారపడి మూడు గ్రామాలలో పంటలు పండిస్తున్నారు. దీనిని నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే రిటెయినింగ్ వాల్ నిర్మించడంతోపాటు బుంగలకు మరమ్మతులు చేసి, నీరు నిల్వ ఉండేలా చూడాలి.
– గంగారాం, రైతు, నర్వ

ఖరీఫ్‌కు 'భరోసా'!

- నిధుల విడుదలను ప్రారంభించిన సీఎం
- 9 రోజుల్లో పూర్తి చేస్తామని సర్కారు ప్రకటన
- అయినా అన్నదాతల్లో అనుమానాలు



కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపికబురు చెప్పింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అగ్రి వర్సిటీలో సోమవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని రైతులందరికీ తొమ్మిది రోజుల్లో పెట్టుబడి సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఒకవైపు ఆనందం వ్యక్తమవుతున్నా మరోవైపు గత అనుభవాల నేపథ్యంలో చాలా మంది రైతులు అయోమయంలో ఉన్నారు.

జిల్లాలో 3.28 లక్షల మంది రైతులు..

గత ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా ఎకరానికి రూ. 5 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించింది. ప్రస్తుత ప్రభుత్వం ఎకరానికి రూ. 6 వేల చొప్పున అందిస్తోంది. జిల్లాలో తాజా లెక్కల ప్రకారం 3.28 లక్షల మంది రైతులు ఉన్నారు. వారందరికీ పెట్టుబడి సాయం అందించాలంటే రూ.316 కోట్లు అవసరం అవుతాయి.

అందరికీ అందేనా?

ప్రభుత్వం రైతు భరోసా పేరిట ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కుగాను పెట్టుబడి సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే గత యాసంగి సీజన్‌లోనూ అందరికీ పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. కానీ నాలుగు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. మిగిలిన రైతులకు రైతు భరోసా రాలేదు. వారంతా రైతుభరోసా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. యాసంగిలో మిగిలిపోయిన రైతులకు పెట్టుబడి సాయం అందించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఖరీఫ్‌లో అందరికీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. ఈసారైనా సాయం అందుతుందో లేదో తెలియక ఆందోళన చెందుతున్నారు. యాసంగిలో లబ్ధి చేకూరని రైతులకూ పెట్టుబడి సాయం అందేలా చూడాలని కోరుతున్నారు.

రెండెకరాలలోపు రైతులకు 'సాయం' నిధుల విడుదల

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వానాకాలం సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం ప్రభుత్వం రైతు భరోసా నిధుల విడుదలను సోమవారం ప్రారంభించింది. తొలిరోజు రెండెకరాలలోపు రైతులకు నిధులను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో 2,05,731 మంది రైతుల ఖాతాల్లో రూ. 106.35 కోట్లు జమ చేశామని పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఓ వర్గానికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- మోర్తాడ్‌లో జాతీయ రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో



మోర్తాడ్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన రొయ్యల సురేశ్ అనే యువకుడిపై 40 మంది దాడి చేస్తే ఆరుగురిపైనే పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు ఆరోపించారు. దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేశారు. దాడికి పాల్పడిన, వారికి మద్దతు తెలుపుతున్న వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడంతోనే ఒక వర్గంవారు మోర్తాడ్‌లో రెచ్చిపోయి హిందువులను లక్ష్యంగా చేసుకొని భౌతికదాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో కరీంనగర్, నిజామాబాద్ రూట్‌లలో వెళ్లాల్సిన వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రమ్, ఇతర పోలీసు అధికారులు ఆందోళనకారులతో చర్చించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని, ఇప్పటి వరకు గుర్తించిన ఆరుగురిని రిమాండ్‌కు తరలించామని సీఐ, ఎస్సైలు వివరించారు. త్వరలోనే మిగిలిన నిందితులపై చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. బాధితుడు రొయ్యల సురేశ్‌కు సరైన న్యాయం జరిగే వరకు తాము ఊరుకోబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు.

జిల్లాలో 72 వీసీ యూనిట్లు ప్రారంభం



రైతునేస్తంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 72 రైతు వేదికలలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి రాష్ట్రంలోని 1,031 రైతు వేదికల్లో 'రైతునేస్తం' అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నమల్లారెడ్డి రైతు వేదికనుంచి కలెక్టర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయానికి అవసరమైన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రతి మంగళవారం ప్రసారం చేస్తుందన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, ఆర్డీవో వీణ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పైసలతోనే పని..!

- కామారెడ్డి బల్దియాపై అవినీతి ఆరోపణలు
- అడిగినంత ఇస్తేనే భవన నిర్మాణ అనుమతులు
- కాసులిస్తే ఆస్తి పన్ను తగ్గింపు
- బిల్లుల చెల్లింపులోనూ కమీషన్లు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాలో అవినీతి రాజ్యమేలుతోంది. పలువురు అధికారులు పైసలిస్తేనే పనులు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని పనులకు చేయి తడపాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ విభాగంలో..

టౌన్ ప్లానింగ్ విభాగంపై ఎక్కువ ఆరోపణలు వస్తున్నాయి. పైసలిస్తేనే భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ఫైల్స్ ముందుకు సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. దరఖాస్తుల్లో చిన్న తప్పిదం ఉన్నా భారీగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్జీవోస్ కాలనీలో ఓ బహుళ అంతస్తు భవన నిర్మాణ అనుమతి వ్యవహారంలో ప్లాటుకు ఇన్సూరెన్స్ లేదన్న నిబంధన చూపించి రూ. 3 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. 36వ వార్డులో 200 గజాలలో ఇంటి నిర్మాణ అనుమతి కోసం గ్రామ కంఠం పేరుతో రూ. 1.20 లక్షలు వసూలు చేశారని సమాచారం. అశోక్‌నగర్ కాలనీలో 50 ఫీట్ల రోడ్డులో నిర్మిస్తున్న షెటర్ల అనుమతి వ్యవహారంలో రూ. 2 లక్షలు, శిశుమందిర్ సమీపంలో జీ ప్లస్ త్రీ ఇంటి నిర్మాణ అనుమతులకోసం రూ. 3 లక్షలు, గొల్లవాడలో ఎల్ఆర్ఎస్ లేదని రూ. 60 వేలు, లింగాపూర్‌లో డాక్యుమెంట్లు సరిగా లేవని రూ. 1.50 లక్షలు, పాత పట్టణంలో ఓ ఆబాది ప్లాటుకు ఎల్ఆర్ఎస్ విధించకుండా అనుమతికి రూ. లక్ష వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. జన్మభూమి రోడ్డులో మురికి కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సదరు విభాగం అధికారులు ఆ భవన యజమాని నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. టీఎస్ బీపాస్‌కు సంబంధించి ప్రతి ఫైల్‌కు ఇప్పటివరకు ఇస్తున్న రూ. 6 వేలను రూ. 8 వేలకు పెంచాలని లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లతోపాటు ఆఫీస్ సిబ్బందికి హుకూం జారీ చేసినట్లు సమాచారం. సదరు అధికారిపై తీవ్రమైన ఆరోపణలు వస్తుండడంతో బదిలీ కోసం తీవ్ర ప్రయత్రాలు చేస్తున్నట్లు తెలిసింది.

తప్పుడు సర్టిఫికెట్ల జారీ..

బల్దియా కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ డబ్బులు తీసుకుని 79 తప్పుడు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. సదరు ఆపరేటర్ 3 నెలలుగా పత్తాలేడు. ఇప్పటికీ అతడిపై చర్యలు తీసుకోలేదు. ఏకంగా కమిషనర్ డిజిటల్ కీ వాడుకుని ధ్రువపత్రాల జారీలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడడం గమనార్హం.

ఇతర విభాగాలపైనా..

బల్దియాలోని రెవెన్యూ విభాగంపైనా ఆరోపణలున్నాయి. పాత జాతీయ రహదారి పక్కనున్న ఓ భవనానికి ఆరు నెలలకు రూ. 1.33 లక్షలు పన్ను ఉంటే.. యజమాని నుంచి డబ్బులు తీసుకుని రూ. 85 వేలకు తగ్గించినట్లు సమాచారం. ఇదే ఏరియాలో మరో భవనానికి రూ. 53 వేల పన్ను ఉంటే దానిని రూ. 38 వేలకు తగ్గించినట్లు, అలాగే సుభాష్‌రోడ్‌లో ఓ వ్యాపార భవనానికి ఆస్తిపన్నును రూ. 40 వేలనుంచి రూ. 9 వేలకు తగ్గించినట్లు, సిరిసిల్ల రోడ్‌లో ఓ ఫంక్షన్ హాల్ కొలతలను తారుమారు చేసి తక్కువ పన్ను వచ్చేలా అసెస్‌మెంట్ పత్రం ఇచ్చారని ఆరోపణలున్నాయి.

కొలతలు లేకుండా ఇష్టారాజ్యంగా ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా సుభాష్‌రోడ్‌లో ఓ వ్యాపార అసోసియేషన్ 9 ట్రేడ్ లైసెన్స్‌ల జారీ కోసం రూ. 30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఇక మున్సిపల్ అభివృద్ధి పనులతో పాటు ఇతర బిల్లుల చెల్లింపులలో 8 నుంచి 15 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు తెలిసింది.

సస్పెన్షన్‌తోనే సరి.. రికవరీ ఏదీ?

బల్దియాకు సంబంధించిన రూ. 10 లక్షల విలువ పాత సామగ్రి దొంగలించిన వ్యవహారంలో ఎఫ్‌బీవోపై సస్పెన్షన్ వేటుతోనే సరిపెట్టారు. ఇప్పటివరకు రికవరీ ఊసే లేదు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. అక్రమాల విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా తనకు ఏమీ తెలియదన్నారు. ఫిర్యాదులు వస్తే విచారణ చేపడతామన్నారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి పోటెత్తిన ఫిర్యాదుదారులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదుదారులు పోటెత్తారు. మొత్తం 135 వినతులు వచ్చాయి. ప్రధానంగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరుకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను పరిస్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. తీసుకున్న చర్యలపై ఫిర్యాదుదారునికి సమాచారం అందించాలని సూచించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్, ఆర్డీవో వీణ, ఏవో మస్రూర్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



భిక్కనూరు: జంగంపల్లి శివారులో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం స్థలాన్ని డీఆర్డీవో సురేందర్ పరిశీలించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వం పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గ్రామ శివారులో గల 669 సర్వే నంబర్ల స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆ సర్వే నంబర్‌లో హైటెన్షన్ వైర్లు ఉండడం వల్ల పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఇబ్బందులు ఉంటాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఐకేపీ డీపీఎం సాయిలు, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



భిక్కనూరు: రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగినా రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులకు లిఖితపూర్వకంగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐ బాలయ్య, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లపై దాడులు



రెండేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినా వాటిలో నివాసం ఉండటానికి ఇప్పటికీ అధికారులు అనుమతించడం లేదని భిక్కనూర్‌కు చెందిన లబ్ధిదారులు తెలిపారు. వారు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించినప్పటికీ వాటిలో నివాసం ఉండేలా ప్రక్రియను పూర్తి చేయలేదని అన్నారు. పత్రాలు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. కొద్ది రోజులుగా తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లపై కొందరు ఆకతాయిలు దాడులు చేస్తూ కిటికీలు, తలుపులు, అద్దాలు, వాటర్ పైపులను ధ్వంసం చేస్తున్నారని వాపోయారు. ధ్వంసమైన వాటికి మరమ్మతులు చేయించి.. కేటాయించాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

పాఠశాలను తరలించొద్దు



బీబీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను మరో చోటకు తరలించవద్దని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ఇటీవల జూనియర్ కళాశాలకు కేటాయించారని తెలిపారు. ఎన్నో యేళ్లుగా తమ ఆడపిల్లలు చదువుకుంటున్న బాలికల పాఠశాలను మరోచోట ఉన్న బాలుర ఉన్నత పాఠశాలలోకి మారుస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారని వెల్లడించారు. ఈ మార్పుతో బాలికల విద్యపై, భద్రతపై ప్రభావం పడుతుందన్నారు. బాలికలకు ప్రత్యేకంగా పాఠశాల ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల ఉన్నత పాఠశాలను అదే భవనంలో కొనసాగించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

నాటి ఢంకేశ్వర్.. నేటి డొంకేశ్వర్

మీకు తెలుసా?



డొంకేశ్వర్ ముఖ చిత్రం

ఎస్సారెస్పీలో ముంపునకు గురైన డొంకేశ్వర్ గ్రామానికి పెద్ద చరిత్రే ఉంది. ఢంకలు మోగించడంతోనే ఈ ఊరికి మొదట ఢంకేశ్వర్ అనే పేరు వచ్చిందట. కాలక్రమేనా డొంకేశ్వర్‌గా మారింది.

- సుమారు 300 ఏళ్ల కిందట భుజంగరావు అనే వ్యక్తి నాలుగు ఎకరాల్లో ఊరిని, ఊర చెరువును స్థాపించాడు.
- ఊరికి నలు దిక్కులా బురుజులు కట్టి గడిని ఏర్పాటు చేసినట్లు చరిత్ర ఉంది.
- ఈ బురుజుల వద్ద సిపాయిలు కాపలా ఉండేవారు. ఢంకలు కొట్టి సంకేతాలు ఇచ్చేవారు.
- కొన్ని రోజులకు పొద్దుటూరి రెడ్డిలు వచ్చి నాలుగెకరాల్లో ఉన్న గ్రామాన్ని 40 ఎకరాలకు విస్తరించారు. మాసం చెరువును కూడా స్థాపించాడు.
- 1975లో ఎస్సారెస్పీలో ముంపునకు గురి కావడంతో ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో నివాసాలు కట్టుకున్నారు.
- సత్య గంగవ్వ, ఆమె కొడుకు మధుసూదన్ రెడ్డి సహకారంతో ఊరి పున: నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి భూములను పంచుకున్నారు.
- ఇళ్ల విస్తీర్ణం 80 ఎకరాల్లో ఉండగా, వ్యవసాయ భూములు 2వేలకు పైగా ఎకరాల్లో ఉంది. డొంకేశ్వర్ గ్రామానికి 1952లో భూమారెడ్డి మొదటి సర్పంచ్‌గా పని చేశారు.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

ధరణి వెంచర్ బాధితుల గోడును పట్టించుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని రామారెడ్డి రోడ్‌లో రాజీవ్ స్వగృహ, ధరణి వెంచర్‌లో ప్లాట్లు తీసుకున్న యజమానుల గోడును ప్రభుత్వం పట్టించుకోవాలని ప్లాట్ల యజమానులు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో వారు మాట్లాడారు. 2022లో ప్రభుత్వం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీతో ఈ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని, ఇప్పటికీ వెంచర్‌లో కనీస సౌకర్యాలు లేవన్నారు. రోడ్లు, మురికికాలువలు, వీధి దీపాలు, నీటి సౌకర్యాలను ఆరు నెలల్లో కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని వాపోయారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

18న రుణ మార్పిడి, రుణాల అమలుపై సమావేశం

కామారెడ్డి అర్బన్: రైతులు.. ప్రయివేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి తీసుకున్న రుణాల నుంచి విముక్తి కల్పించడానికి రుణ మార్పిడి, రుణాల అమలుపై ఈనెల 18న ఉదయం 10.30 గంటలకు చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో సమావేశం ఏర్పాటు చేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రీయంగా నియంత్రితమైన రుణ మార్పిడి విధానాన్ని అమలు చేయడానికి హైకోర్టు ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేస్తున్నందున రైతులు, బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కామారెడ్డి అర్బన్: జల్ జీవన్, మహిళా సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని గ్రామంలో 25 నుంచి 30 మంది మహిళలు ముందుకు వస్తే అదే గ్రామంలో శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందిస్తామని, శిక్షణ అనంతరం 50 శాతం రాయితీపై కుట్టు మిషన్లు అందజేయనున్నట్టు రవికుమార్ తెలపారు. అలాగే శిక్షణ ఇవ్వడానికి అనుభవం ఉన్న మహిళలు ముందుకు వస్తే రూ.పదివేల వేతనం చెల్లిస్తామన్నారు. వివరాలకు 95027 18116, 85007 97860 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాలకు 18న ఎంపికలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): తెలంగాణ స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతి ప్రవేశానికి ఈ నెల 18న మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రవీణ్ తెలిపారు. సెప్టెంబర్ 1, 2016 నుంచి ఆగస్టు 31, 2017 మధ్యలో జన్మించిన విద్యార్థులు అర్హులని, ఒరిజినల్ ధ్రువపత్రాలతో బుధవారం ఉదయం 10 గంటలకు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు.

నషాళానికి ఎక్కుతున్న 'మసాలా' ధరలు

ఎల్లారెడ్డి: సామాన్య కుటుంబాలకు పోపుల పెట్టె భారంగా మారింది. పచ్చళ్ల సీజను కావడంతో మసాలా దినుసుల ధరలు నషాళానికి ఎక్కుతున్నాయి. 2 నెలల క్రితం ధరలతో పోలిస్తే మసాలా దినుసుల ధర రూ.50 నుంచి 200 వరకు పెరిగాయి. పచ్చళ్ల సీజనులో పచ్చళ్లు పెట్టకపోతే జీవితంలో ఏదో కోల్పోయినట్లు భావించే వారు ఎందరో ఉన్నారు. పెరిగిన దినుసుల ధరలతో 100 మామిడికాయల పచ్చడి పెట్టడానికి ప్రస్తుతం సుమారు రూ.5 వేలు ఖర్చవుతున్నదని పలువురు అంటున్నారు. గతంలో 100 కాయల పచ్చడికి రూ.3 వేలు ఖర్చయ్యేదని .. గత సంవత్సరం రూ.5 ఉన్న మామిడికాయ ప్రస్తుతం రూ.10–12 కాగా కిలో నూనె రూ.100 నుంచి రూ.150 వరకు పెరిగిందని అంటున్నారు. వీటితో పాటు పచ్చళ్ల తయారీకి ఉపయోగించే ఆవాలు, మెంతులు,తదితర దినుసుల ధరలు 30 నుంచి రూ.100 వరకు ధరలు పెరిగినట్లు సమాచారం . వ్యాపారులు కూడా ధరలు పెంచేసి లూటీ చేస్తున్నారని ప్రజలు అంటున్నారు. సీజన్లో మసాలా దినుసుల ధరలపై అధికారులు నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రైం కార్నర్

అదుపుతప్పి బోల్తాపడిన టిప్పర్



నస్రుల్లాబాద్: మండలంలోని లింగంపల్లి గ్రామ శివారులో గల ప్రధాన రహదారిపై ఓ టిప్పర్ అదుపు తప్పి సమీప పంట పొలాల్లో బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నస్రుల్లాబాద్ వైపు నుంచి బైరాపూర్ వైపునకు సోమవారం మొరం తీసుకొని వెళుతున్న టిప్పర్ అదుపుతప్పి పంట పొలాల్లో పడిపోయింది. డ్రైవర్ అప్రమత్తం అవ్వడంతో ఎటువంటి గాయాలు కాలేదు. అధిక లోడ్‌తో మొరం తరలించడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

తాగుడుకు బానిసై ఆత్మహత్య



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పడంపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. మహారాష్ట్రలోని ముద్‌ఖేడ్ తాలుకా, పుంజ్ ఏక్లార గ్రామానికి చెందిన బోయిల్‌వాడ్ హన్మంతు(34)కు మండలంలోని పెద్దఎడ్గి గ్రామానికి చెందిన గంగమణితో గతంలో వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. మద్యం తాగుడుకు బానిసైన హన్మంతు జీవితంపై విరక్తి చెంది, పంట చేను వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నదిలో పడి బిహార్ యువకుడి మృతి

రుద్రూర్: మంజీరా నదిలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి మృతి చెందాడు. కోటగిరి ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా.. బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీల బృందం ఇటీవల పోతంగల్ మండలం కల్లూర్ గ్రామానికి వరి నాట్లు వేయడానికి వచ్చింది. వీరిలో రాజేష్ కుమార్ సహాని(32) అనే యువకుడు ఆదివారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకోడానికి కొడిచర్ల శివారులోని మంజీరా నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు వీరేంద్ర కుమార్ సహాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరు..

మాక్లూర్: బైక్ అదుపుతప్పి కిందపడిన వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దుర్గానగర్‌కు చెందిన కే శంకర్ (62) తన బైక్‌పై సోమవారం నిజామాబాద్ బయలుదేరాడు. మాణిక్ బండారు శివారులో అతడి బైక్ అదుపు తప్పడంతో కిందపడి గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

నగరంలో గుర్తుతెలియని వ్యక్తి..



ఖలీల్‌వాడి: నగరంలోని బస్‌డిపో–1 మెయిన్ గేట్ పక్కన ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బస్టాండ్ సెక్యూరిటీ సిబ్బంది మృతుడిని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడు ఎరుపు రంగు టీ షర్ట్, గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించినట్లు చెప్పారు. అతడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిసినచో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాని ఫోన్ నంబర్ 87126 59714కు సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



అభిషేక్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. నవీపేట మండలం జన్నేపల్లికి చెందిన అభిషేక్(28) ఆదివారం తన బైక్‌పై పని నిమిత్తం నందిపేట వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మండలంలోని కొత్తపల్లి శివారులో అతడిని ట్రాక్టర్ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అభిషేక్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడు చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మాక్లూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి



నిరసన తెలుపుతున్న పీఎంపీ, ఆర్ఎంపీలు



వైద్యుడిపై చెప్పులతో దాడిచేస్తున్న మహిళలు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ చేపడుతున్న దాడులు వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాలోని గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీలు సోమవారం ర్యాలీ తీశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిల్లా సాయిబాబా, జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. ఆర్ఎంపీ, పీఎంపీలపై స్టేట్ మెడికల్ కౌన్సిల్ పెట్టిన కేసులను ఎత్తివేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసిన గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ఇచ్చి గుర్తించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కట్టా అశోక్, గరువ శ్రీనివాస్, రాజేశ్వర్, బోధన్, ఆర్మూర్ డివిజన్ల అధ్యక్షుల రాజగోపాల్‌చారీ, సాయిలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీపై మహిళల దాడి

నిజామాబాద్‌నాగారం: ఆర్ఎంపీ, పీఎంపీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ అశోక్‌పై మహిళలు చెప్పులతో దాడి చేశారు. ఆర్ఎంపీ వైద్యుడు అశోక్ మహిళలతో అసభ్యకరంగా మాట్లాడుతూ, మాయమాటలతో మోసం చేస్తున్నారని ఇద్దరు మహిళలు పేర్కొంటూ చెప్పుతో దాడి చేశారు. వైద్యం కోసం వెళ్తే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

సీపీని కలిసిన బెటాలియన్ కమాండెంట్



సీపీ సాయిచైతన్యకు మొక్కను అందజేస్తున్న బెటాలియన కమాండెంట్ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సాయి చైతన్యను సోమవారం డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేశారు.

తండ్రిని హతమార్చిన కూతురు



నర్సయ్య మృతదేహం

నవీపేట: ఫాదర్స్ డే మరునాడే కన్న కూతురు చేతిలో తండ్రి హతమైన ఘటన మండలంలోని ధర్మారం(ఎ) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ధర్మారం గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54) సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో తాళ్ల కొత్తపేటలో ఉండే చిన్నకూతురు మక్కల వర్షిణి అలియాస్ మమత రోకలి దుడ్డుతో తలపై బాది చంపేసింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌లు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి అన్న కొడుకు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, విచారిస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు తీర్పునిచ్చింది. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లికి చెందిన గొల్ల భార్గవి (21)ని గాంధారి మండలం పోతంగల్ కలాన్ గ్రామానికి చెందిన ముక్కార శ్రీనివాస్ ప్రేమించానని గొడవ చేయడంతో ఇరువురి కుటుంబ సభ్యులు 2022లో వారికి వివాహం జరిపించారు. కొద్ది రోజుల తర్వాత భార్గవిపై భర్త శ్రీనివాస్, అత్త లక్ష్మీలు తరచుగా అదనపు కట్నం, అనుమానంతో కూడిన వేధింపులు మొదలు పెట్టారు. వాటిని భరించలేక భార్గవి తన తల్లిగారింటి వద్దకు వచ్చేసింది. అయినా వేధింపులు తగ్గకపోవడంతో 2023 సెప్టెంబర్ 22న ఆమె పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసిన పోలీసులు భర్త, అత్త లను రిమాండ్‌కు పంపారు.

కోర్టులో విచారణ జరుగగా, సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడు శ్రీనివాస్‌కు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీ ఆర్.ప్రకాష్, రూరల్ సీఐ రాజు, ఎస్సై రాజు, పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టు లైజనింగ్ అధికారి రాజయ్య, రామేశ్వర్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రాజేశ్ చంద్ర అభినందించారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు



దోమకొండ: మండల కేంద్రంలో సోమవారం గ్రామపంచాయతీ కార్మికుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండలోని స్థానిక సాయిబాబా గుడి కాలనీలో విద్యుత్ స్తంభాలకు బల్బులను సరిచేయడానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ నిలిపివేశారు. అనంతరం వెంకట్‌రెడ్డి పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు ఇనుప స్తంభానికి తగలడంతో అతడికి కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కాగా గ్రామపంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకొని, ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల పంచాయతీ కార్మికుడికి గాయాలైనట్లు పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు



ఎల్లారెడ్డి: మండలంలోని హాజీపూర్ తండాలోగల సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఈనెల 14న రాత్రి చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై మహేష్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. రాంపూర్ గ్రామానికి చెందిన గడ్డండ్ల పాల్ అనే వ్యక్తి ఈనెల 14న తండాలోని ఆలయ హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించాడు. తండాలోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కోర్టు పేషీలకు హాజరుకాని మహిళ రిమాండ్..

ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు పరిధిలో దొంగతనం కేసులో రిమాండయిన ఓ మహిళ కోర్టు పేషీలకు హాజరు కాకుండా తిరుగుతోంది. దీంతో సదరు మహిళపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో ఆమెను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మాజీలైనా.. మార్చుకోని హోదాలు

జిల్లాలోని పలువురు నాయకులు పదవీలో ఉన్నప్పుడు తమ వాహనాలకు ముందు, వెనుక భాగంలో రేడియంతో తమ హోదాలను ముద్రించుకున్నారు. మున్సిపల్, పరిషత్, పంచాయతీల పదవీ కాలం ముగిసి, నెలలు గడుస్తోంది. కానీ పలువురు ప్రజాప్రతినిధులు తమ హోదాలను తమ వాహనాలపై అలానే కొనసాగిస్తున్నారు. అయినా పోలీసులు, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



కారుపై రాసి ఉన్న 'మున్సిపాల్ వైస్ చైర్మన్ భీమ్‌గల్'







కారుపై రాసి ఉన్న కార్పొరేటర్ ఎంసీఎన్ .. మరో వాహనంపై ఉన్న ఎంపీపీ రూరల్ మండలం.. మరో కారుపై ఉన్న ఎంపీపీ నవీపేట్